FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం
@netifocusnews @focustv
www.netifocusnews.com
TS-18-0006625
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | శుక్రవారం 15, మార్చి 2024 | పేజీలు: 04

# కమలం దూకుడు



## నేటి నుంచి తెలంగాణలో ప్రధాని ఎన్నికల ప్రచారం..

- మల్కాజిగిరి నియోజకవర్గంలో రోడ్ షో
- అనంతరం రాజ్‌భవన్‌కు.. అక్కడే బస
- రేపు నాగర్‌కర్నూల్..
- 18న జగిత్యాలలో బహిరంగ సభ..



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మార్చి 14:**

**లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో** కమలం పార్టీ స్పీడు పెంచింది. మెజారిటీ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పార్టీ జాతీయ అగ్రనేతలు స్వయంగా రంగంలోకి దిగారు. పది రోజుల వ్యవధిలో ప్రధాని మోదీ రెండోసారి పర్యటించనున్నారు. అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపే తంపై రాష్ట్ర పార్టీకి మిగతా 2లో..



# నేటి నుంచి వాహనాలకు టీజీ అమలు

## 0001 నుంచి ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు

## ‘టీఎస్’ వాహనాలు యథాతథం: పొన్నం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, మార్చి 14:**

**తెలంగాణ మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ రాష్ట్ర కోడ్ శుక్రవారం నుంచి ‘టీజీ’గా మారనుంది. రాష్ట్ర కోడ్‌ను ‘టీఎస్’ నుంచి ‘టీజీ’కి మార్చాలంటూ రేవంత్‌రెడ్డి సర్కారు కేంద్రాన్ని కోరిన విషయం తెలిసిందే..! మూడ్రోజుల క్రితం ఆ మేరకు కేంద్ర రవాణా శాఖ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. శుక్రవారం నుంచి ‘టీజీ’ కోడ్‌ను అమలు చేయాలంటూ రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు గురువారం గెజిట్ విడుదల చేశారు.**

దీంతోపాటుగా.. ఇంతకు ముందు పేర్కొన్న జిల్లా వాహనాల కోడ్‌లు యథావిధిగా కొనసాగుతాయని, వాటికి ముందు టీజీ చేరుతుందని చెబుతూ.. ఆ జాబితాను విడుదల చేశారు. అంతేకాదు.. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్లు ‘0001’ నుంచి మొదలవుతాయి. మిగతా 2లో..





# రాష్ట్రపతికి చేరిన జమిలి వివరాలు

- 18,629 పేజీల నివేదిక అందచేసిన కోవింద్
- 190 రోజుల పాటు వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ
- రాష్ట్రపతిని కలిసి నేవదిక అందించిన రామ్‌నాథ్ కోవింద్

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి14:**

సమిలి ఎన్నికలపై అధ్యయనం జరిపిన కోవింద్ కమిటీ తన నివేదికను రాష్ట్రపతి ద్ంరౌపది ముర్మకు అందచేసింది. ఒకే దేశం.. ఒకే ఎన్నికలు పేరిట దేశంలో అన్నిరకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే ప్రతిపాదనపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ అధ్యయనం జరిపింది. ఈ నివేదికను గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మకు సమర్పించింది. గురువారం ఉదయం కోవింద్ సహా కమిటీ సభ్యులు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. మిగతా 2లో..




# కన్నుమూత

- నివాళ్లర్పించిన ఎమ్మెల్యే హరీష్ రావు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి14:**

ఉమ్మడి వరంగల్ జిల్లా చెన్నూరు మాజీ శాసన సభ్యులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ చైర్మన్ డాక్టర్ నెమరు గొమ్ముల సుధాకర్ రావు మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో ఉన్న పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. గత కొన్నాళ్లుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస మిగతా 2లో..

# వెనక్కి తగ్గేదేలే..

- సీఏఏ ఎవరికీ వ్యతిరేకం కాదన్న హోంమంత్రి
- విపక్షాల వాదనల్లో అర్థం లేదన్న అమిత్ షా

2





## పేదల భవిష్యత్‌పై
# బాబు యుద్ధం

- కూటమితో వస్తున్న వారి నిజస్వరూపం గుర్తించండి
- ప్రజాసంక్షేమం కొనసాగాలంటే వైకాపా గెలవాలి
- 14 ఏళ్లు సిఎంగా చంద్రబాబు చేసిందేమిటో చూడండి
- పవన్ కళ్యాణ్ ఓ మ్యారేజ్ స్టార్ మాత్రమే
- బనగానపల్లిలో ఇబిసి నేస్తం నిధులు విడుదల
- చంద్రబాబు, పవన్‌లపై ఘాటు జగన్ ఘాటు విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, నంద్యాల-మార్చి14:**

పేదల భవిష్యత్తుపై యుద్దానికి చంద్రబాబు కూటమి మరోసారి సిద్ధమైందని.. ఈ ఎన్నికల్లో ఓటు అనే దివ్యాస్త్రాన్ని వాళ్ల మీద జాగ్రత్తగా ప్రయోగించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు పిలుపు ఇచ్చారు. పేద ప్రజలకు చేస్తున్న సంక్షేమాన్ని కొనసాగించాలంటే వైకాపా మళ్లీ గెలవాల్సి ఉందన్నారు. బనగానపల్లెలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధుల విడుదల సందర్భంగా చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియాపై మిగతా 2లో..

# టీడీపీ రెండో జాబితా విడుదల

2

- 34మందితో జాబితా విడుదల చేసిన పార్టీ


14-03-2024

| క్రసంఖ్య | పార్లమెంట్ | నియోజకవర్గం | అభ్యర్థి పేరు |
|---|---|---|---|
| 25 | కర్నూల్ | ఎమ్మిగనూరు | జయనాగేశ్వర రెడ్డి |
| 26 | కర్నూల్ | మంత్రాలయం | రాఘవేంద్ర రెడ్డి |
| 27 | హిందూపూర్ | పుట్టపర్తి | పల్లె సింధూరా రెడ్డి |
| 28 | హిందూపూర్ | కదిరి | కందికుంట యశోదా దేవి |
| 29 | రాజంపేట | మదనపల్లి | షాజహాన్ బాషా |



## టెన్త్‌లో నిముషం నిబంధన ఎత్తివేత

- 5 నిముషాల ఆలస్యం అయినా అనుమతి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి14**

10వ తరగతి విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కొంత కాలం నుంచి అమలులో ఉన్న నిమిషం నిబంధనను ఎత్తివేసింది. పరీక్షా కేంద్రానికి హాజరయ్యేందుకు 5 నిమిషాల మిగతా 2లో..

## అన్ని రంగాల్లో దేశాభివృద్ధి..

- ప్రధాని మోదీతోనే అభివృద్ధి సాధ్యం..
- బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్



## టెన్త్‌లో నిముషం నిబంధన ఎత్తివేత

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి14:

10వ తరగతి విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కొంత కాలం నుంచి అమలులో ఉన్న నిమిషం నిబంధనను ఎత్తివేసింది. పరీక్షా కేంద్రానికి హాజరయ్యేందుకు 5 నిమిషాల గ్రేస్ టైం ఇచ్చింది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు కాస్త టెన్షన్ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభంకానున్నాయి. ప్రకటించిన గ్రేస్‌టైమ్ కారణంగా విద్యార్థులను ఉదయం 9.35 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. కాగా మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఇప్పటికే భారీ ఏర్పాట్లు చేశారు. ఎగ్జామ్ సెంటర్ల వద్ద సెల్‌ఫోన్‌లను నిషేధించారు. జిరాక్స్ సెంటర్లను మూసేస్తారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. గతంలో లీకేజ్ అనుభవాల దృష్ట్యా పకడ్బందీ చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది.

## టీడీపీ రెండో జాబితా విడుదల

నేటి ఫోకస్ న్యూస్, అమరావతి-మార్చి14:

పొత్తులు కుదరడంతో ఇప్పటికే తొలిజాబితా ప్రకటించిన టిడిపి తన రెండో జాబితాను గురువారం ప్రకటించింది. ఈ ఎన్నికల్లో జనసేన-బీజేపీతో కలిసి బరిలోకి దిగుతున్న టీడీపీ ఇప్పటికే తొలి విడతలో భాగంగా 94 స్థానాలకు అభ్యర్థులకు ప్రకటించింది. తాజాగా రెండో విడత అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. రెండో విడతలో భాగంగా 34 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇప్పటివరకు మొత్తం 128 స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ నేడో, రేపో విడుదల కావడానికి ముందు తెలుగుదేశం పార్టీ రెండో జాబితా అభ్యర్థులను ప్రకటించింది. 34 మంది అభ్యర్థులతో ప్రకటించిన ఈ జాబితాలో మొత్తం 11 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 9 మంది గ్రాడ్యుయేషన్ చేసినవారు ఉన్నారు. ఒకరు పీహెచ్‌డీ చేసిన అభ్యర్థి ఉన్నారు. కాగా 8 మంది ఇంటర్మీడియెట్, ఐదుగురు 10వ తరగతి విద్యార్హతగా కలిగినవారు ఉన్నారు. మొత్తం అభ్యర్థుల్లో 27 మంది పరుషులు, ఏడుగురు స్త్రీలు ఉన్నారు. ఇక అభ్యర్థుల వయసు విషయానికి వస్తే 25-35 ఏళ్ల మధ్య వయసువారు ఇద్దరు, 36-45 ఏళ్లలోపువారు 8 మంది, 46-60 ఏళ్ల వయసున్నవారు 19 మంది, 61-75 ఏళ్లవారు ముగ్గురు, 75 ఏళ్లకుపైబడినవారు ఇద్దరు ఉన్నారు.

1. గాజువాక-పల్లా శ్రీనివాసరావు
2. రంప చోడవరం - మిర్యాల శిరీష
3. గోపాలపురం-మద్దిపాటి వెంకటరాజు
4. ప్రత్తిపాడు-వరుపుల సత్యప్రభ
5. దెందులూరు-చింతమనేని ప్రభాకర్
6. గుంటూరు ఈస్ట్-మహ్మద్ నజీర్
7. గుంటూర్ వెస్ట్- పిడుగురాళ్ల మాధవి
8. గిద్దలూర్-అశోక్ రెడ్డి
9. పెద్దకూరపాడు-భాష్యం ప్రవీణ్
10. రాజమండ్రి రూరల్-గోరెంట్ల బుచ్చయ్య చౌదరి
11. నరసన్నపేట- బొగ్గురమణమూర్తి
12. గురజాల-యరపతినేని శ్రీనివాసరావు
13. కోవూరు(నెల్లూరు జిల్లా)- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
14. కొవ్వూరు(రాజమండ్రి)-ముప్పిడి వెంకటేశ్వరరావు
15. చోడవరం-కేఎస్ఎన్ఎస్ రాజు
16. ఆత్మకూరు-ఆనంరాం నారాయణరెడ్డి
17. నందికొట్కూర్- గిత్తా జయసూర్య
18. కదిరి-కందికుంట యశోదా దేవి
19. మాడుగుల-రెలా ప్రసాద్
20. కందుకూర్ - ఇంటూరి నాగేశ్వరరావు
21. మదనపల్లి-షాజహాన్ భాషా
22. రామచంద్రపురం- వాసంశెట్టి సుభాష్
23. మార్కాపురం-కందుల నారాయణ రెడ్డి
24. వెంకటగిరి- కురుగొండ్ల లక్ష్మిప్రియ
25. కమలాపురం- పుత్తా చైతన్య రెడ్డి
26. ప్రొద్దుటూరు-వరదరాజుల రెడ్డి
27. ఎమ్మిగనూరు-జయనాగేశ్వర రెడ్డి
28. మంత్రాలయం- రాఘవేంద్ర రెడ్డి
29. పుట్టపర్తి-పల్లె సింధూరా రెడ్డి
30. పుంగనూరు-చల్లా రామ చంద్రారెడ్డి(బాబు)
31. చంద్రగిరి- పులివర్తి వెంకట మణిప్రసాద్(నాని)
32. శ్రీకాళహస్తి- బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి
33. సత్యవేడు-కోనేటి ఆదిమూలం
34. పూతలపట్టు- డాక్టర్ కలికిరి మురళి మోహన్

# పేదల భవిష్యత్‌పై చంద్రబాబు యుద్ధం

(మొదటి పేజీ తరువాయి..)

వైఎస్సార్ ఈబీసీ నేస్తం నిధుల విడుదల సంద ర్భంగా చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియా పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మరోవంక.. మనకు ప్రతిపక్షంగా ఉన్న చంద్రబాబును, దత్తపు త్రుడిని చూడండి. వీరిద్దరి పేరు చెబితే అక్కచెల్లె మ్మలకు ఏం గుర్తుకొస్తుంది?. చంద్రబాబు పేరు చెబితే 14 సంవత్సరాలు, 3 సార్లు సీఎం అయిన వ్యక్తి పేరు చెబితే గుర్తొచ్చేది బాబు చేసిన వంచనలు గుర్తుకొస్తాయి. పొదుపు సంఘాల మహిళలకు చంద్రబాబు చేసిన దగా గుర్తుకొస్తుంది.? ఆయన చేసిన ఒక్కటంటే ఒక్క మంచీ గుర్తుకురాదు. ఒక్క స్కీము కూడా గుర్తుకురాని పరిస్థితి. దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థను భ్రష్టు పట్టించే ఓ మోసగాడు గుర్తుకొస్తాడు. ఏదేండ్లకోకసారి కార్లు మార్చినట్లుగా భార్యలను మార్చే ఒక మ్యారేజీ స్టార్, ఓ వంచకుడు గుర్తుకొస్తాడు. ఒకరికి విశ్వసనీయత లేదు. మరొకరికి విలువలు లేవు. వీరు మూడు పార్టీలుగా కూటమిగా ఏర్పడి ఈరోజు మీ బిడ్డ మీదకు యుద్ధానికి వస్తున్నారు.. కాదు కాదు.. మూడు పార్టీలుగా కూటమిగా ఏర్పడి పేదవాడి భవిష్యత్ మీద యుద్ధానికి వస్తున్నారని హెచ్చరించారు. దేవుడి దయతో ఈరోజు మరో మంచి కార్యక్రమం ఇక్కడ బనగానపల్లె నుంచి చేస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన ఓసీ అక్కచెల్లెమ్మలు, వారి కుటుంబాలకు కూడా మంచి చేస్తూ ఈరోజు మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఈబీసీ నేస్తం అనే ఈ పథకంతో 45నుంచి 60 సంవత్సరాల వయసులో ఉన్న నా అక్కచెల్లెమ్మలందరికీ రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, వెలమ, బ్రాహ్మణ.. తదితర ఓసీల్లో ఉన్న అక్కచె÷-లలెమ్మలకు కూడా ఆర్థిక స్వావలంబన కలిగిస్తూ ఏటా రూ.15,000 చొప్పున వరుసగా చేయి పట్టుకుని నడిపిస్తూ మూడేళ్లపాటు సహాయం అందించే కార్యక్రమమే ఈ వైఎస్సార్ ఈబీసీ నేస్తం అన్నారు. పేదరికానికి కులం ఉండదు. పేదవాడు ఎక్కడ ఉన్నా కూడా వారికి తోడుగా ఉండగలిగే మనసు ప్రభుత్వంలో ఉన్న పెద్దలకు ఉండాలి. ఆదుకునే గుణం ఉండాలి, తోడుగా నిలబడాలి అనే ఆరాటం ఉండాలి. వైఎస్సార్ ఈబీసీ నేస్తంగానీ, వైఎస్సార్ కాపు నేస్తంగానీ మేనిఫెస్టోలో పెట్టినవి కావు. అయినా వారికి త తోడుగా ఉండాలని, పేదరికం వల్ల వారు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని వారి కోసం కూడా అడుగులు వేసిన ప్రభుత్వం మీ బిడ్డ ప్రభుత్వం. ఈరోజు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 4,19,528 మంది నా అక్కచె÷-లలెమ్మలకు 629 కోట్లు వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేయనున్నాం. ఈరోజు జమ చేస్తున్న ఈ సొమ్ముతో కలుపుకొంటే మూడు దఫాల్లో 4,95,269 మంది అక్కచె÷-లలెమ్మలకు మంచి జరిగిస్తూ రూ.1877 కోట్లు వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా మంచి చేయగలిగాం అన్నారు.

# కమలం దూకుడు..

(మొదటి పేజీ తరువాయి..)

దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

**రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్**

కాంగ్రెసకు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

## రాష్ట్రపతికి చేరిన జమిలి వివరాలు

(మొదటి పేజీ తరువాయి..)

సమాచారం. ఏకకాల ఎన్నికల నిర్వహ ణపై గత కొన్నేళ్లు గా బలంగా ప్రచారం చేస్తున్న మోదీ సర్కారు.. 2023 సెప్టెంబరులో దీనిపై కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ను నియమించింది. కేంద్ర మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో విపక్షనేత అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ సెక్రెటరీ జనరల్ సుభాష్ కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీలను కమిటీలో సభ్యులుగా చేర్చింది.ప్రత్యేక ఆహ్వా నితుడిగా కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, కమిటీ సెక్రెటరీగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నితిన్ చంద్రలకు బాధ్యతలు అప్పగించింది. 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' అంశంపైలా కమిషన్ కూడా తమ నివేదికను దాదాపు సిద్ధం చేసినట్లు తెలిసింది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఒక అధ్యాయాన్ని చేర్చాలని లా కమిషన్ సూచించే అవకాశం ఉందని సమాచారం. 2029 నాటికి ఏకకాల ఎన్నికల నిర్వహణ వీలయ్యేలా చేసేందుకు అవసరమైన మార్గసూచీని లా కమిషన్ ప్రభుత్వానికి అందజేయవచ్చని తెలుస్తోంది. దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యా సాధ్యాలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ అధ్యాయనం పూర్తయ్యింది. దేశంలో ఏకకా లంలో లోక్‌సభ, అసెంబ్లీ, మున్సిపాల్టీ, పంచా యతీ ఎన్నికల నిర్వహణకు గల సాధ్యాసా ధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటైన విష యం తెలిసిందే. ఈ కమిటీ ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదంతో జమిలి ఎన్నికల నిర్వహణ మనదేశంలో ఎంతవరకు సాధ్యం, ఇతర అంశాలపై వివిధ వర్గాల నుంచి సమాచారం.

### మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు

# కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి..)

విడిచారు. ఆయన అంత్యక్రియలు మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం వడ్డే కొత్తపల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఎండోక్రైనాలజిస్ట్‌గా అంతర్జాతీయ గుర్తింపు పొందిన డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు స్వస్థలం మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని వడ్డేకొత్తపల్లి. 1974 లో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన 1984లో డీఎం పట్టా అందుకున్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఉద్యోగం ప్రారంభించి, గాంధీ మెడికల్ కాలేజీలో ఎండోక్రైనాలజీ విభాగం అధిపతిగా 1999లో రిటైర్ అయ్యారు. ఆ తర్వాత పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో వివిధ హోదాల్లో కొనసాగి వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 8 పరిశోధన పత్రాలను ప్రచురించారు. జాతీయ, అంతర్జాతీయ వైద్యుల సొసైటీల్లో సభ్యుడిగా ఉన్న ఆయనకు 2014లో ఎండోక్రైనాలజీ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు, 2016లో డయాబెటిక్ విభాగంలో లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డులు వరించాయి. సుధాకర్‌రావు తండ్రి యతిరాజారావు ఉమ్మడి ఏపీలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. యతిరాజారావు మంత్రిగా కూడా పనిచేశారు. 1999 నుంచి 2003 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సుధాకర్ రావు అంచనాల కమిటీ సభ్యుడిగా, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరించారు. గత ఆగస్టు 14న ఆయనను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్‌గా నాటి సీఎం కేసీఆర్ నియమించారు.

# నేటి నుంచి వాహనాలకు టీజీ అమలు..


(మొదటి పేజీ తరువాయి..)

కాగా.. రాష్ట్రంలో రోజుకు సగటున 4 వేల వరకు వాహనాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

**టీఎస్ వాహనాలు యథాతథం!**

రాష్ట్ర వాహనాల కోడ్ 'టీజీ'గా మారిన నేపథ్యంలో..

గత పదేళ్లుగా 'టీఎస'గా రిజిస్టర్ అయిన వాహనాలు యథాతథంగా కొనసాగుతాయని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్టర్ అయిన 'ఏపీ' కోడ్ తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా కొనసాగింది. ఇప్పుడు 'టీఎస్' విషయంలోనూ అంతే. వాటన్నింటినీ 'టీజీ'గా మార్చడం భారీ ప్రక్రియ. పైగా.. వాహనదారులకు రిజిస్ట్రేషన్ కార్డు, కొత్త హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ కోసం అదనపు చార్జీల భారం పడుతుంది.




**టీజీతో తెలంగాణ ఆత్మగౌరవం: పొన్నం**

టీజీ అనే పదం తెలంగాణ ఆత్మ గౌరవం అని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఆయన హనుమకొండ కలెక్టరేట్, భీమదేవరపల్లి, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జూన్ 2న గెజిట్‌లో టీజీ అనే పేర్కొన్నదని గుర్తుచేశారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వానికి నివేదించి టీఎసగా మార్చిందన్నారు. తాము క్యాబినెట్, శాసనసభ తీర్మానం మేరకు కేంద్రానికి విజ్ఞప్తి చేసి, తిరిగి 'టీజీ'గా మార్పించామన్నారు.

## నేడు ప్రభుత్వ ఇఫ్తార్ విందు

### - ఎల్‌బి స్టేడియంలో భారీగా ఏర్పాట్లు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి14:

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఈ నెల 15న తొలి శుక్రవారం నాడు నగరంలోని ఎల్బీ స్టేడియంలో ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇవ్వనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. నిర్వహణ ఏర్పాట్లను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులంతా పాల్గొంటారని షబ్బీర్ అలీ తెలిపారు. ఆహ్వానితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. స్టేడియంలో నమాజ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఇఫ్తార్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయాలు అందుబాటులో ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, నగర అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌ను ఎలా ఆదేశించగలం: హైకోర్టు

### - హైదరాబాద్ ఉమ్మడి రాజధాని పిల్ కొట్టివేత

నేటి ఫోకస్ న్యూస్, విజయవాడ-మార్చి14:

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు హైదరాబాద్ ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంచేలా చట్టం తీసుకురావాల్సిందిగా కేంద్ర హోం శాఖను ఆదేశించాలని దాఖలైన పిల్ ను హై కోర్టు కొట్టివేసింది. ఉమ్మడి రాజధానిపై పార్లమెంట్ ను ఎలా ఆదేశించగలమని హై కోర్టు ప్రశ్నించింది. తమకు కూడా కొన్ని పరిమితులుంటాయని, రాజధాని అంశంపై ఆదేశాలు ఇవ్వడం పిల్ వేసినంత సులువు కాదని వ్యాఖ్యానించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందన్ రావుతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.ఏపీ విభజన చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం.. రెండు రాష్ట్రాల మధ్య ఇంకా అప్పులు, ఆస్తులు, కంపెనీలు, కార్పొరేషన్ల విభజన ప్రక్రియ పూర్తి కాలేదని.. హైదరాబాద్ ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంచాలని కోరుతూ ఇబ్రహీంపట్నంకు చెందిన ప్రజాసంక్షేమ సేవా సంఘం కార్యదర్శి పొదిలి అనిల్ కుమార్ హైకోర్టులో వేసిన పిల్ బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా ప్రకటించి.. ఈ ఏడాది జూన్ 2 నాటికి పదేళ్లు పూర్తవుతాయని, అప్పులు, ఆస్తుల విభజన పూర్తయ్యేవరకూ మరో పదేళ్లు హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా ఉంచాలన్నారు. ఇదంతా విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై చట్టం చేసేలా పార్లమెంట్ ను ఆదేశించలేమని పేర్కొంటూ.. పిటిషన్ ను కొట్టివేసింది.

## సీఏఏపై వెనక్కి తగ్గం..

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి14:

సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోమని హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతిపక్ష కాంగ్రెస్ సహా తృణమూల్, సీపీఐ, ఆప్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర పార్టీలు ఈ చట్టాన్ని ఇప్పటికే వ్యతిరేకించాయి. తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయబోమని స్పష్టం చేస్తున్నాయి. ఈ చట్టాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్లు కూడా వెల్లువెత్తున్నాయి. పలువురు ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో సీఏఏ అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోమని హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం మాత్రం విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మతపరమైన హింసను ఎదుర్కొంటూ భారతదేశానికి రావాలని నిర్ణయించుకున్న ముస్లిమేతర మైనారిటీల కోసం ఉద్దేశించినదని షా వెల్లడించారు. ఇదే సందర్భంలో విపక్షాలపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్షాలకు ఏ పనీ లేదని అన్నారు. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్‌ను కూడా స్వార్థ రాజకీయాల కోసం చేసినట్లు వారు విమర్శిస్తుం టారని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోకూడదా..? అని షా ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దును కూడా రాజకీయ లబ్ది కోసం చేసినట్లు ప్రతిపక్షాలు పేర్కొన్నాయని అమిత్ షా మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే చట్టాన్ని ఉపసంహరిస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారన్నారు. వారు ఎన్నటికీ అధికారంలోకి రాలేరని, మోదీ సర్కారు తీసుకొచ్చిన ఈ చట్టాన్ని రద్దు చేయడం అసాధ్యమని షా పేర్కొన్నారు. భారత పౌరసత్వం కోసం అందరికీ తలుపులు తెరిచే ఉన్నాయని ఈ సందర్భంగా అమిత్ షా పేర్కొన్నారు. సీఏఏ రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు చేస్తున్న వాదనలో వాస్తవం లేదన్నారు. అది ఆర్టికల్ 14కు ఎలాంటి భంగం కలిగించదని వెల్లడించారు. ఈ చట్టంపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. నాలుగేండ్ల కిందట ఆమోదం పొందిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం-2019 (సీఏఏ)ను తాజాగా అమల్లోకి తీసుకొచ్చింది.

# అన్ని రంగాల్లో దేశాభివృద్ధి..

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి14:

దేశాన్ని అన్ని రంగాల్లో మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రపంచ దేశాలన్నీ మోదీకి రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నాయని బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దేశానికి మోడీ పాలనే శరణ్యమన్నారు. ప్రపంచ దేశాలు కూడా మోడీ నాయకత్వంపై నమ్మకంతో ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్- బండ్ల గూడ రోడ్డులోని మహవీర్ హరిణ వనస్థలి పార్కులో మార్నింగ్ వాకర్స్‌తో సమావేశం నిర్వహించారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని వాకర్స్‌ను కోరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. మరోసారి మోదీ ప్రభుత్వమే రావాలని దేశమంతా కోరు కుంటుందని, రాష్ట్రంలోనూ మెజారిటీ సీట్లు బీజేపీయే గెలుచుకోబోతుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి సురేందర్‌నాథ్‌యాదవ్, వెంకటే శ్వరరెడ్డి పాల్గొన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది.

# డికెతో మల్లారెడ్డి భేటీ..

నేటి ఫోకస్ న్యూస్, బెంగళూరు-మార్చి14: లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి షాకుల మీద షాకులు తగు లుతున్నాయి. ఒక్కొరి వెంట ఒకరు కారు దిగుతూ అధికార పార్టీ హస్తంతో దోస్తీ కడుతున్నారు. ఇప్పటికే పలువురు సిట్టింగ్ ఎంపీలతో పాటు మాజీలుగా మారిన పలువురు కీలక నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా మాజీ మంత్రి, ప్రస్తుత మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ తో కలిసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. కర్నాటక కాంగ్రెస్ నేత డికె శివ కుమార్‌తో మల్లారెడ్డి, భద్రారెడ్డి భేటీ ఆసక్తిగా మారింది. బెంగళూరులో డికెను మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి కలిశారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా మల్లారెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరితే మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ తన కుమారుడికి ఇవ్వాల్సిందిగా కోరుతున్నట్టు సమాచారం.



# సీఎంఆర్ ధాన్యాన్ని సకాలంలో అందజేయండి

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్**

వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్)

కేంద్ర ఆహార సంస్థతో పాటు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు అందించాల్సిన పెండింగ్ సీ.ఎం.ఆర్ ధాన్యాన్ని రైస్ మిల్లర్లు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్లో రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు, పౌర సరఫరాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2020-21, 2021-22 సంవత్సరాల్లో ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న 430 ఏసీకేల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖకు అందించే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు . అదేవిధంగా 2022-2023 రబీ సీజన్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న 546 ఏసీకేలను కేంద్ర ఆహార సంస్థకు అప్పగించాలని చెప్పారు. 2023-24 ఖరీఫ్ సీజన్కు సంబంధించి 71 రైస్ మిల్లర్లు 4418 ఏసీకేల ధాన్యాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు వెళ్లినపుడు రైస్ మిల్లర్లు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. అంతేకాకుండా తక్కువ నాణ్యత కలిగిన ధాన్యాన్ని స్థానంలో మంచి ధాన్యాన్ని రీప్లేస్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యం. నగేష్, డీసీఎస్వో నగేశ్, రైస్ మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి





**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్**

వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):

ప్రజాస్వామ్యంపై ప్రజల్లో విశ్వాసం కల్పించేలా రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణి హాల్లో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ సన్నద్ధత పై జిల్లా ఎస్పీ రక్షిత కృష్ణమూర్తి తో కలిసి నోడల్ అధికారులు, సెక్టరియల్ అధికారులు, ఎస్.ఎస్.టి/ఎఫ్.ఎస్.టి బృందాలు, పోలీస్ అధికారులు తదితర ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నిర్వహణ బాధ్యతల పై అవగాహనా, శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమవళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వస్తుందని, నోడల్ అధికారులతో పాటు ప్రతి ఒక్క సిబ్బంది వారికి కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలనీ ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పని చేసే సిబ్బంది తెలిసి తెలియక చేసే తప్పులకు సైతం అవకాశం ఇవ్వకూడదని చెప్పారు. అందరూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పని చేయాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన వెంటనే తొలి 24, 48, 72 గంటల్లో తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఒక్కో నోడల్ అధికారికి సంబంధించిన విధులు వారి బాధ్యతలను వివరిస్తూ ప్రొజెక్టర్ పై చూపిస్తూ అవగాహన కల్పించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. అధికారులంతా సమన్వయం చేసుకొని ఎన్నికల విధులు నిర్వహించాలని, అప్పుడే సమస్యలు రాకుండా చేయవచ్చని చెప్పారు. ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కుపై స్వీప్ యాక్టివిటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సీ విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, పోస్టల్ బ్యాలెట్ అలాగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. నోడల్ అధికారులు వారి విధులు జగ్రత్తగా నిర్వహించాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈవీఎంల తరలింపు, అదేవిధంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సెక్టర్ అధికారులకు వాహనాల కేటాయింపు, పోలింగ్ సిబ్బందికి కావల్సిన వాహనాలు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. జీపీఎస్ ట్రాకింగ్ మానిటరింగ్ వాహనాలు కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. షెడ్యూల్ వెలువడిన తర్వాత ప్రజాప్రతినిధులు ప్రభుత్వ వాహనాలను వ్యక్తిగత, రాజకీయ సంబంధిత పనులకు వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు రాజకీయ నాయకులను కలవడం కానీ, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనడం కానీ చేయవద్దనీ అది ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిధిలోకి వస్తుందన్నారు. ఎన్నికల క్యాంపెయిన్, రాజకీయ సమావేశాలను ఎస్.ఎస్. టి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ద్వారా వీడియో తీయించాలని సూచించారు. ఎన్నికల్లో భాగంగా పౌరుల నుంచి మొబైల్ యాప్ ద్వారా కానీ, ఇతర మాధ్యమాల ద్వారా కానీ వచ్చే ఫిర్యాదులపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకొని రిపోర్టు సమర్పించాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ అంశంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా బెల్టు షాపుల విషయంలో చర్యలు తీసుకోవాలని చెప్పారు. బైండోవర్ కేసుల అంశంలో అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్క పోలీసు అధికారి ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా, జాగ్రత్తగా పని చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యం. నగేష్, డీఎఫ్వో నవీన్, ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్, అందరు నోడల్ అధికారులు, సెక్టర్ అధికారులు,ఫ్లైయింగ్ సర్వేవలెన్స్, విజిలన్స్,వీడియో బృందాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తాం

**- మల్కాజ్గిరిలో ఈటల రాజేందర్ కు ఎదురేలేదు**

**- హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన**

**- బిజెపి హబ్సిగూడ అధ్యక్షుడు కక్కిరేణి హరీష్**

నేటి ఫోకస్ న్యూస్, హబ్సిగూడ:



భారతీయ జనతా పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ మరియు మాజీ ఎమ్మెల్యే బొడిగా శోభ తో కలసి హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ నివాసానికి విచ్చేశారు ఈ సందర్భంగా చేతన హరీష్ వారిని శాలువ తో సన్మానించారు అనంతరం భారతీయ జనతా పార్టీ హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కక్కిరేణి హరీష్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ ను భారీ మెజారిటీతో గెలిపించి దేశంలో ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన హక్కుల గర్జన కరపత్రం విడుదల

- గిరిజన హక్కుల గర్జన పేరుతో జరుగు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి
- కరపత్రం విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మానాయక్
- గిరిజన యూనివర్సిటీలో 80% గిరిజనుల రిజర్వేషన్ ఇవ్వాలి
- గిరిజన తెగలు మాట్లాడే భాషకు లిపి కనుగొనాలి
- దేశంలో గిరిజన జనాభాకు నిష్పత్తి 10శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ మార్చి 14

ఈనెల 20వ తేదీన తాను నాయక్ వర్ధంతి రోజున హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న గిరిజనుల హక్కుల గర్జన సదస్సు కరపత్రమును సిఐటియు కార్యాలయం ముందు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడ్ ధర్మానాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...2024 పార్లమెంట్ ఎన్నికలు ఏప్రిల్, మే నెలలో దేశ వ్యాప్తంగా జరగనున్నాయని అధికారంలోకి రావడం కొరకు అధికార బిజెపి ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని దేశవ్యాప్తంగా గిరిజనుల ఓట్లను ఆకర్షించేంద ుకు మోసపూరిత వాగ్దానాలు చేసేందుకు ఎన్నికల మేనిఫెస్టోను సిద్ధం చేసుకుంటున్నాయని ఇటువంటి నేపథ్యంలో గిరిజనుల సమస్యల హక్కులపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని రాజకీయ పార్టీల అజెండాలో గిరిజన డిమాండ్లపై డిక్లరేషన్ ప్రకటించడం కొరకు తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన హక్కులకై గర్జన పేరుతో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నామని వారు అన్నారు. గిరిజన తెగలు చేసిన బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు ఫలితంగా స్వాతంత్ర ఉద్యమం స్ఫూర్తితో గిరిజనులకు రాజ్యాంగంలో ప్రత్యేక హక్కులు చట్టాలు కల్పించబడ్డాయని అనేక రాష్ట్రాల్లో 5, 6 షెడ్యూల్ ప్రాంతాలుగా గుర్తించి అందులో గిరిజనులకు స్వయం నిర్ణయాధికారాలు అడవులు అటవీ భూములు, అటవీ సంపదపై హక్కులు ఉన్న 1/70 చట్టం , పేసా చట్టం ,అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006, ఆర్టికల్ 371 ఏ నుండి హెచ్ వరకు ఈశాన్య రాష్ట్రాల గిరిజన హక్కులు ఆర్టికల్ 275(1)విద్యా, ఉద్యోగాల్లో 100% స్థానిక గిరిజనులకే రిజర్వేషన్ కల్పించే జీవో నెంబర్ 3 అనేకం అమలులో ఉన్నాయని ఒకే దేశం ఒకే చట్టం పేరుతో బిజెపి ప్రభుత్వం గిరిజనులకు కల్పించబడ్డ ప్రత్యేక హక్కులన్నింటినీ తొలగించుకు నేందుకు సిద్ధపడుతుందని వారు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సదస్సుకు ఆదివాసి గిరిజన సంఘాల ప్రజా ప్రతినిధులు మేధావులు పాల్గొంటారని వారు తెలియజేశారు. గత పది సంవత్సరాల కాలం లో గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో బిజెపి ప్రభుత్వం విఫలమయ్యిందని గిరిజనులు అభివృద్ధి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని కేంద్ర బడ్జెట్లో గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించి ఖర్చు చేయాల్సిన నిధులను లక్షల కోట్లు దారి మళ్లించిందని దేశంలో ఏడు శాతంగా ఉన్న గిరిజనులకు రిజర్వేషన్లు 12 శాతానికి పెంచకుండా నిర్లక్ష్యం చేసిందని, అగ్రవర్ణ పేదల పేరుతో 10శాతం రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం వేలాది గిరిజన యువతకు ఉపాధి కల్పించే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయలేమని చేతులెత్తేసిందని అన్నారు గిరిజనులకు 80 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏర్పాటు చేయాల్సిన గిరిజన యూనివర్సిటీని కేవలం ఏడు శాతం రిజర్వేషన్ ఏర్పాటు చేస్తూ గిరిజనులకు అన్యాయం చేసిందని అన్నారు. యూరెనియమం తవ్వకాల తో నల్లమల్ల అడవులను ధ్వంసం చేసేందుకు సిద్ధపడుతుందన్నారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దేశా నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ నాయకులు శ్రీను, %ఎ%.రాజేష్, బి పవన్ కే ప్రవీణ్ తదితరులున్నారు.

## మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయటంపై హర్షం వ్యక్తం

**ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్ఛార్జ్ మేకల రమేష్**

(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్, ఎర్రుపాలెం మార్చి 14:

తెలంగాణ ప్రభుత్వం అన్ని కార్పొరేషన్ల తో పాటు మాదిగ కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్ఛార్జ్ మేకల రమేష్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పొన్నం ప్రభాకర్ గారికి బట్టి విక్రమార్క కి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్పొరేషన్ ద్వారా మాదిగలకు మేలు జరుగుతుందని, మాదిగలకు గుర్తింపు ఆయన వస్తుందని ఆశ వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ సంపత్‌కు కేటాయించాలి!

**- 19 శాతం. ఉన్న మాదిగల ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలి!**

**- మల్లు నాగర్ కర్నూల్ పార్లమెంటుకు ముళ్ళు తొందర్లో నువ్వు ఖమ్మం వెళ్ళు**

**- టీఎస్ ఎం.అర్.పి ఎస్. నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ మల్లెపోగు శ్రీనివాస్ మాదిగ!**

(నేటి ఫోకస్ న్యూస్ నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ మార్చ్ 14):

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ను మాదిగ సామాజిక వర్గానికి చెందిన సంపత్ కు కేటాయించాలని టిఎస్ ఎమ్మార్పీఎస్ నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇన్చార్జి దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ మాదిగ కాంగ్రెస్ పార్టీని కోరారు స్థానిక నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం బాబు జగజీవన్ రామ్ విగ్రహం దగ్గర ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. 19 శాతం ఉన్న మాదిగలకు టికెట్ కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు ఏడు శాతం ఉన్న మాలలకు టికెట్ కేటాయిస్తే కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓడిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు నాగర్ కర్నూల్ పార్లమెంటుకు మల్లు రవి ముళ్ళు లాంటి వారని ఆయన తొందర్లో ఖమ్మం వెళ్లాలని ఇక్కడ స్థానికులకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీని కోరారు విద్యార్థి దశ నుండే కాంగ్రెస్ పార్టీకి ఎన్నో సేవలు అందించి నాగర్ కర్నూల్ పార్లమెంట్ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ ఎందరికో తమ వంతు సేవ చేస్తున్న సంపత్ కు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏకగ్రీవ తీర్మానం చేసి టికెట్ కేటాయించాలని కోరారు లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓడిపోతుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి అభిమన్యు జిల్లా ఉపాధ్యక్షులు జోగు శ్రీనివాసులు జిల్లా ప్రధాన కార్యదర్శి బాలనాగులు కొమ్ము పరమేశ్వర్ శివశంకర్ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా పోటీకే పవన్ మొగ్గు

- పిఠాపురం నుంచి పోటీ చేయనున్న జనసేనాని
- ఆవిర్భావ దినోత్సవంలో స్వయంగా ప్రకటన

నేటి ఫోకస్ న్యూస్, మంగళగిరి-మార్చి14:

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేసే స్థానంపై ఉత్కంఠ వీడింది. కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్టు పవన్ స్వయంగా వెల్లడించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ సభలో ఈమేరకు ప్రకటన చేశారు. తనకు ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉందని, ప్రస్తుతానికి ఎంపీగా పోటీ చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. తెదేపా, భాజపాతో పొత్తులో భాగంగా జనసేనకు 21 అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆయన బుధవారం రాత్రి మరో 9 మందికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. వారితో మాట్లాడి ఎన్నికల ప్రచారం చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పెందుర్తి నియోజకవర్గం నుంచి పంచకర్ల రమేశ్, ఎలమంచిలి నుంచి సుందరపు విజయకుమార్, విశాఖ దక్షిణం నుంచి వంశీకృష్ణయాదవ్ లను పిలిచి మాట్లాడి ప్రచారం చేసుకోవాలని చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అభ్యర్థిగా బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, భీమవరం నుంచి మంగళవారం పార్టీలో చేరిన పులపర్తి రామాంజనేయులు అభ్యర్థిత్వాలకు ఆమోదం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు నుంచి దేవవరప్రసాద్ అభ్యర్థిత్వం ఖరారు చేశారు. తిరుపతి నుంచి ఆరణి శ్రీనివాసులుతో భేటీ అయ్యారు. ఈ స్థానం కూడా దాదాపు ఖరారైనట్లేనని చెబుతున్నారు. ఇప్పటికే పార్టీ తరఫున నిడదవోలు నియోజకవర్గం నుంచి కందుల దుర్గేష్, కాకినాడ గ్రామీణం నుంచి పంతం నానాజీ, నెల్లిమర్ల నుంచి లోకం మాధవి పోటీ చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.



# అశ్లీల కంటెంట్ వ్యాప్తి

**- 18 ఓటిటి ప్లాట్‌ఫామ్‌లపై కేంద్రం నిషేధం**

**న్యూఢిల్లీ-మార్చి14:** కేంద్ర ప్రభుత్వం 18 ఓటిటి ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధం విధించింది. అశ్లీల కంటెంట్‌ని ఎక్కువగా ప్రమోట్ చేస్తున్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేసింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కి చెందిన 19 వెబ్‌సైట్‌లు, 10 యాప్స్, 57 సోషల్ మీడియా హ్యాండిల్స్‌ని బ్లాక్ చేస్తున్నట్టు వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఈ నిషేధం వర్తిస్తుందని తేల్చి చెప్పింది. చాలా రోజులుగా కేంద్ర ప్రభుత్వం ఈ ఎ÷-లాట్‌ఫామ్స్‌కి హెచ్చరికలు జారీ చేసింది. అశ్లీల కంటెంట్‌ని తొలగించాలని ఆదేశించింది. అయినా స్పందించకపోవడం వల్ల ఇప్పుడు వేటు వేసింది. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ మార్చి 12వ తేదీనే ఈ వేటు వేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 10 యాప్స్‌ని వెంటనే బ్లాక్ చేయాలని తేల్చి చెప్పారు. ఇందులో గూగుల్ ప్లే స్టోర్‌లో 7 యాప్స్, యాప్‌స్టోర్‌లో మూడు యాప్స్ ఉన్నాయి. ఎనొనీసపజీబితినీని ÷ుఇఠనిన్గీ÷నీణా ంఇబి, 2000లోని నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్రం వెల్లడించింది. సంబంధింత శాఖ అధికారులతో పాటు మహిళా హక్కుల నిపుణులను సంప్రదించిన తరవాతే ఈ నిషేధం విధించింది.

# ఏక్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి14:

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సమయం ఆసన్నమైంది. భారత ఎన్నికల సంఘం ఒకటి రెండు రోజుల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నోటిఫికేషన్ వివరాలు ప్రకటించే అవకాశం ఉందంటూ జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. నేడో, రెపో షెడ్యూల్ ప్రకటించవచ్చని పేర్కొంటున్నాయి. ప్రకటన తేదీల్లో మార్పు ఏమైనా ఉన్నా ఈ వారంలో షెడ్యూల్ విడుదల కావడం ఖాయమంటూ రిపోర్టులు పేర్కొంటున్నాయి. కాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కూడా వెలువడనుంది. జమ్ముకాశ్మీర్‌లో ఎన్నికల సన్నద్ధతపై ఎన్నికల సంఘం బృందం పరిశీలన అనంతరం నోటిఫికేషన్ వెలువడాల్సి ఉందని, అయితే ఎన్నికల సంఘం బుధవారం జమ్ముకాశ్మీర్‌లో పర్యటించడంతో ఇక నోటిఫికేషన్ వెలువడడమే తరువాయి అని జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. కాగా సెప్టెంబర్ 30, 2024లోగా జమ్మూ కాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు గతేడాది కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం బృందం బుధవారం అక్కడ పర్యటించింది.

నేటి ఫోకస్ న్యూస్

శుక్రవారం 15, మార్చి 2024

# ఇలాంటి సినిమా ఎప్పుడూ రాలే.. గామిపై విశ్వక్‌సేన్ వ్యాఖ్య




**విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కిన** చిత్రం 'గామి' ద్వారా విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. మార్చి 8న విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌ను సొంతం చేసు కుంది. తాజాగా తిరుపతి వెళ్లిన విశ్వక్ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'చాలా రిస్క్ చేసి 'గామి' తీశాం. ఇది కమర్షియల్‌గా హిట్ అయినం దుకు చాలా ఆనందంగా ఉంది. మేం ఆరేళ్లు కష్టపడి తీసిన సినిమా ఇది. మా సినిమా నలుగురు పెద్ద మను షులు చూసి.. మాట్లాడితే బాగుంటుంది. ఇది మన తెలుగు సినిమా. ఇలాంటి చిత్రం ఇప్పటి వరకు రాలేదని గర్వంగా చెబుతాను. మరో 20 ఏళ్ల తర్వాత తెలుగులో ఇలాంటి సిని మా వచ్చిందని గర్వంగా చెప్పొచ్చు. నేను ఓవర్ కాన్ఫిడెన్స్‌తో చెబుతోన్న మాటలు కావు. సినిమా రిలీజైన నాలుగు రోజులకు చెబుతున్నానంటే నాకెంత నమ్మకముందో అర్థం చేసుకోవాలి. కొందరు కావాలనే నెగెటివ్ రివ్యూ ఇస్తున్నారు. ఇదంతా ఎవ రు చేస్తున్నారో తెలియదు. వారి గురించి పట్టించుకునేంత సమయం నాకు లేదు' అన్నారు. ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు విశ్వక్ ధన్యవాదాలు చెప్పారు. ప్రస్తుతం విశ్వక్ సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' లో నటిస్తున్నారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో ఇది రానుంది. గోదావరి బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్, వినోదం నిండిన కథతో ఈ చిత్రాన్ని తీర్చి దిద్దుతున్నారు. ఇందులో ఆయన పూర్తి మాస్ గెటప్‌లో కనిపించనున్నారు. నేహాశెట్టి హీరోయిన్‌గా అలరించనున్నారు. ఇప్పటికే పాటలకు మంచి ప్రేక్షకాదరణ వచ్చింది. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# మమితా బైజు నటన అద్భుతం

## ప్రేమలు హీరోయిన్‌కు రాజమౌళి కితాబు

**'గిరిజ (గీతాంజలి ఫేమ్),** సాయి పల్లవి (ఫిదా ఫేమ్) ఎలా అయితే మ్యాజిక్ క్రియేట్ చేశారో మమితా బైజు అలా చేసింది. ఎంతో చలాకీగా నటించింది'.. 'ప్రేమలు' సక్సెస్ మీట్‌లో యంగ్ హీరోయిన్‌కు డైరెక్టర్ రాజమౌళి ఇచ్చిన ప్రశంస ఇది. అగ్ర దర్శకుడు ఇలా అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఇప్పుడు అందరి దృష్టి ఆమెపై పడింది. మలయాళంలో విజయవంతమైన 'ప్రేమలు' సినిమాని అదే పేరుతో రాజమౌళి తనయుడు కార్తికేయ తెలుగులో విడుదల చేశారు. కంటెంట్ బాగుంటే ఏ భాషలో తెరకెక్కిన చిత్రాన్నైనా తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారనేది ఈ సినిమాతో మరోసారి రుజువైంది. నటీనటులు, దర్శకుడు.. అందరూ ఇక్కడి వారికి కొత్తే. కానీ, వారి ప్రతిభ కట్టిపడేసింది. ముఖ్యంగా మమిత అందం, అభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాఫ్ట్‌వేర్ రీనూ పాత్రలో ఒదిగిపోయి ఎంతో మందికి అభిమాన నటిగా మారింది. దీంతో, సామాజిక మాధ్యమం ఎక్స్ (ఇంతకుముందు ట్విటర్)లో.. ఆమె గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూ క్లిప్పింగ్స్, 'ప్రేమలు'లోని పాటలు, ఆమె ఫొటోలు వైరల్ అయ్యాయి. 'న్యూ క్రష్', 'క్యూట్' అంటూ కామెంట్లు వెల్లువెత్తాయి. నేరుగా తెలుగులో నటించకపోయినా డబ్బింగ్ చిత్రంతో ఇంతటి క్రేజ్ సొంతం చేసుకోవడం విశేషం. ఈ అందాల భామకు కోలీవుడ్‌లో వరుస అవకాశాలు వస్తున్నాయి. జీవీ ప్రకాశ్ కుమార్ సరసన ఆమె నటించిన 'రెబల్' మార్చి 22న విడుదల కానుంది. విష్ణు విశాల్ హీరోగా తెరకెక్కనున్న ఓ చిత్రంలో మమిత హీరోయిన్‌గా ఫిక్స్ అయిందని సమాచారం. ఈ బ్యూటీకి 'ప్రేమలు' 16వ సినిమా. మిగిలిన చిత్రాలన్నింటిలో సపోర్టింగ్ క్యారెక్టర్లు ప్లే చేసింది. ఈ ముద్దుగుమ్మ నటించిన తొలి చిత్రం 'సర్వోపరి పలక్కరన్' (2017).



# శేఖర్ కమ్ములతో నాగ్, ధనుష్ సినిమా

కుబేర' కోసం దర్శకుడు శేఖర్ కమ్ములతో చేతులు కలిపారు కథానాయకులు ధనుష్, నాగార్జున. ఈ ముగ్గురి కలయికలో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రష్మిక కథానాయిక. ఈ సినిమా కొత్త షెడ్యూల్ బ్యాంకాక్‌లో ప్రారంభమైనట్లు చిత్ర బృందం బుధవారం ప్రకటించింది. నాగార్జునతో పాటు మరికొందరు కీలక నటులు ఈ చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో భాగంగా యాక్షన్‌తో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించ నున్నారు. మాఫియా నేపథ్యమున్న ఓ ఆసక్తికర కథాంశంతో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఛాయాగ్రహణం: నికేత్ బొమ్మి.






# రవికుల రఘురామ ట్రైలర్ విడుదల

పాజిటివ్ వైబ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రం 'రవికుల రఘురామ'.చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో.. సినిమా నిర్మాణం పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్నారు. యువ హీరో గౌతమ్ సాగి, అందాల భామ దీప్సిక జంటగా నటిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ మంచి స్పందనను రాబట్టుకున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు విడుదలైన 'చందమామే', 'ప్రాణాలే' సాంగ్స్ శ్రోతలని అలరించగా.. తాజాగా మేకర్స్ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను విలక్షణ నటుడు విజయ్ సేతుపతి చేతుల మీదుగా విడుదల చేశారు.ట్రైలర్ విడుదల అనంతరం విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. ట్రైలర్ చాలా ప్రామిసింగ్‌గా ఉంది. సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. మార్చి 15న విడుదల కాబోతున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి. అలాగే ఈ సినిమాకు వర్క్ చేసిన నటీనటులు, సాంకేతికనిపుణులందరికీ మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను.





# సినిమాల ఎంపికలో రాజమౌళి సలహాలు పాటిస్తా..: అలియా భట్

**సినిమాల ఎంపిక విషయంలో** తనకు రాజమౌళి సలహా ఇచ్చారని నటి అలియా భట్ తెలిపారు. ఆయన దర్శకత్వంలో 'ఆర్ఆర్ఆర్'లో నటించిన మెప్పించారు అలియా. తాజాగా ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ దర్శకధీరుడు ఇచ్చిన సలహాను పంచుకున్నారు. 'చిత్రాలను ఎంపిక చేసుకొనే విషయంలో నేను మొదటి నుంచి ఒత్తిడికి లోనవుతుంటాను. అదే విషయం రాజమౌళికి చెప్పాను. 'ఏది ఎంచుకున్నా ప్రేమతో చేయండి. అప్పుడు సినిమా ఫలితం ఎలా ఉన్నా ప్రేక్షకులు మీ నటనను ప్రశంసిస్తారు. మీకు కనెక్ట్ అవుతారు. ఈ ప్రపంచంలో ప్రేమతో చేసే పనికి మించిన గొప్పది ఏదీ లేదు' అని ఆయన చెప్పారు. అప్పటి నుంచి అదే పాటిస్తున్నా. ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా వద్దకు వచ్చిన ప్రతి కథకు ఓకే చెప్పేదాన్ని. నిజం చెప్పాలంటే నాకు సహనం తక్కువ. ఇప్పుడు ఆ పద్ధతి మారింది. ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు ఎంతకష్టమైన పాత్రనైనా అంగీకరించాలని నిర్ణయించు కున్నా' అని అలియా తెలిపారు. ప్రస్తుతం అలియా ప్రధానపాత్రలో 'జిగ్రా' రూపొందుతోంది.వాసన్ బాలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తన ప్రొడక్షన్స్‌పై కరణ్ జోహార్‌తో కలిసి నిర్మిస్తున్న చిత్రమిది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సెప్టెంబర్ 27న విడుదల కానుంది. సామాజిక మాధ్యమాల వేదికగా సెట్స్ నుంచి కొన్ని ఫొటోలను అలియా పంచుకోగా అవి ఆకట్టుకున్నాయి.